# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 2 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | గురువారం | 3-4-2025 | వెల : .రూ. 5.00




## 400 ఎకరాల్లో చెట్ల నరికివేత చేపట్టొద్దు

- సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ
- నేటికి వాయిదా వేసిన హైకోర్టు
- ఎక్కడ చెట్లను నరకవద్దని ఆదేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు -మిగతా 2 లో




## ఇది బలహీనవర్గాల ధర్మయుద్ధం

**మా రాష్ట్రంలో ఆమోదించిన బీసీ బిల్లును ఆమోదించండి**

- రాహుల్ ఆదేశాల మేరకు బీసీ కులగణన
- గుజరాత్‌లో అమలుచేయాలని మేం కోరడం లేదు
- మా డిమాండ్‌కు మీరు మోకాలడ్డవద్దు
- జంతరమంతర్ బీసీ ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీ బిల్లు ఆలోచనకు స్ఫూర్తి రాహుల్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనగణనలో కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారన్నారు. అందుకే బీజేపీ కుట్రపూరితంగా జనగణన -మిగతా 2 లో



## ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

- వ్యాధి సోకి చిన్నారి మృతి


**పల్నాడు, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తొలి బర్డ్ ఫ్లూ మరణం సంభవించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకి చెందిన రెండేళ్ల చిన్నారి బర్డ్ ఫ్లూ వైరస్ తో మృతి చెందింది. పచ్చి కోడి మాంసం తినడం వల్ల బర్డ్ ఫ్లూ సోకి మరణించిందని ఎయిమ్స్ వైద్యులు ధృవీకరించారు. గత నెల 4వ తేదీన జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో మంగళగిరి ఎయిమ్స్‌లో -మిగతా 2 లో



## శాంతి చర్చలకు మేము సిద్ధం

- తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి'
- శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి
- కేంద్రానికి మావోయిస్టుల లేఖ

**హైదరాబాద్:ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** గత వందరోజుల్లోనే భద్రతా బలగాలు 120 మందకిపైగా మావోయిస్టులను ఎన్‌కౌంటర్లలో హతమర్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ప్రతిపాదిస్తే.. కాల్పుల విరమణకు -మిగతా 2 లో



## తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

- ఏప్రిల్ 30 వరకు పెంచుతు ఆదేశాలు

**హైదరాబాద్ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతు ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ పక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. -మిగతా 2 లో

## నియోజకవర్గానికి లక్షమంది తరలింపు



**రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు**

- నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక
- రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం
- మెదక్, నిజామాబాద్ నేతలకు కేసీఆర్ సూచన

**గజ్వేల్ ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభ ఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమవేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ -మిగతా 2 లో



## ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

- విద్యార్థులను చితకబాదిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే -మిగతా 2 లో

## ఆస్తుల పరిరక్షణకే వక్ఫ్ చట్టం సవరణ




- లోక్‌సభలో వక్ఫ్‌చట్ట చట్టసవరణ బిల్లు
- చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు
- లేకుంటే పార్లమెంట్ స్థలం కూడా వక్ఫ్‌దే అంటారు
- కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. -మిగతా 2 లో

## తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత



- భూముల కాపాడటంలో బీఆర్ఎస్ ఎంతో శ్రమించింది
- రేవంత్‌కు పాలన చేతకావడం లేదు : ఎమెల్సీ కవిత

**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సీఎం రేవంత్ పాలన ఎవరికి అర్థం కావడం లేదని.. ఇంత తక్కువ కాలంలో ప్రజావ్యతిరేకత కూడగట్టుకున్న సీఎం ఆయనే అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడపలేని స్థితిలో ఉన్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దుశ్చర్య వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయింది కాబట్టి 400 ఎకరాల భూమిని విక్రయించాలని నిర్ణయించారు అని ఆమె అన్నారు. బుధవారం ఆమె మీడియాలో -మిగతా 2 లో

# ఇది బలహీనవర్గాల ధర్మయుద్ధం

(మొదటి తరువాయి)

వాయిదా వేస్తోందని మండిపడ్డారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీని బీసీల లెక్కలు అడిగారని తెలిపారు. ఎక్కడ అధికారంలోకి వచ్చినా కుల గణన చేస్తామని పాదయాత్రలో రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే కుటగణన చేపట్టామని అన్నారు. బుధవారం నాడు ఢిల్లీలోని జంతర్ మంతర్ బీసీ పోరు గర్జనలో సీఎం పాల్గొని ప్రసంగించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణలో నిలబెట్టానని తెలిపారు. తండ్రి కొడుకు ఉద్యోగం ఊడకొట్టండి మీకు ఉద్యోగాలు వస్తాయని ఎన్నికల సమయంలో పాదయాత్రలో చెప్పానన్నారు. అన్న ప్రకారమే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. బీసీలది ధర్మబద్ధ కోరిక అది నెరవేర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. బీజేపీ అందుకు సిద్ధంగా లేదని విమర్శించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా బీజేపీ యాత్ర చేసిందన్నారు. ఇందిరాగాంధీ దళిత్ కాదని.. కానీ ఆమె అందరికీ భూములు ఇచ్చారని.. ఇళ్లు కట్టించారని అన్నారు. అసైన్డ్ భూములు ఇందిరాగాంధీ ఇచ్చారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం ఆమోదించిన తేదీ ఫిబ్రవరి 4 అని.. ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డే గా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. తెలంగాణలో కులగణన చేసి బీసీల లెక్క 56.36 శాతం అని తేల్చిందని.. గుజరాత్ సహా దేశంలో ఏ రాష్ట్రంలోనూ కులగణన చేయలేదన్నారు. రాహుల్ గాంధీ మాట ప్రకారం తెలంగాణ మొట్టమొదటి సారి కులగణన చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచమన్న డిమాండ్ మాత్రమే కాదు, ఉద్యోగ, విద్య రంగంలో కూడా ఈ పెంపు ఉండాలని నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ల పెంపు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న వ్యవహారమని.. అందుకే మేము తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని తెలిపారు. మేము మా రాష్ట్రంలో పెంచుకుంటాం అన్నాం. మీ రాష్ట్రంలో చేయమని మేము అడగలేదు. మా రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచితే నరేంద్ర మోదీకి వచ్చిన కష్టమేంటి? మా పిల్లల చదువులు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాల కోసం 42 శాతం ఇవ్వాలని మేం ప్రయత్నం చేస్తుంటే.. మీకు ఏం కష్టం వచ్చింది? మా తీర్మానం ప్రకారం రిజర్వేషన్లు పెంచమని కోరుతూ బీజేపీ నేతలను బీసీ సంఘాలు కలిశాయి. అయినా ఉలుకు లేదు. పలుకు లేదు. అందుకే ఢిల్లీలో బీసీ మహా ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి బీసీ సంఘాలకు ఏర్పడిందని సిఎం రేవంత్ అన్నారు. కురుక్షేత్ర యుద్ధంలో చెప్పినట్టు- 'అయిననూ హస్తిన పోయి రావలె'.. అన్నట్లు ఢిల్లీకి వచ్చి ధర్నా చేస్తున్నారు. మా మీద ఆధిపత్యం చెలాయించాలని చూడొద్దు. నిజాం పాలకులకు ఏ గతి పట్టిందో చూశారు. ఆంధ్రా పాలకులకు ఏం జరిగిందో చూశారు. మీరెప్పుడూ ఢిల్లీలో ఉండరు. గల్లీలోకి రావాల్సిందే. చిన్న సాయం చేస్తే జీవితాంతం గుర్తుపెట్టుకునే జాతులు మా బీసీ జాతులు. ఈ జాతులకు అన్యాయం చేస్తే ఎలా మర్చిపోతారు? దేశమంతటా మీరు అమలు చేస్తారా లేదా అని నేను అడగడం లేదు. మా తెలంగాణలో తీర్మానం చేసిన ప్రకారం పెంచమని మాత్రమే అడుగుతున్నాను' అని రేవంత్ అన్నారు. రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించినా సరే అనేక బిల్లులు తెచ్చి చట్టాలు చేశారన్నారు. ట్రిపుల్ తలాఖ్ తెచ్చారని.. ఆర్టికల్ 370 రద్దు చేశారని... వ్యవసాయంపై నల్ల చట్టాలు తెచ్చారని తెలిపారు. మరి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఏం సమస్య వచ్చిందని ప్రశ్నించారు. బీసీల కోసం ప్రాణాలు ఇస్తామని బండి సంజయ్ అంటారని.. 'మాకు మీ ప్రాణాలు వద్దు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి చాలు' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ గర్జన మహా ధర్నాకు వివిధ పార్టీల ఎంపీలు మద్దు తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ, డీఎంకే కనిమొలి, ఎన్సీపీ ఎంపీ సుప్రియ సూలే మహాధర్నాకు మద్దతు ఇస్తూ ధర్నాలో పాల్గొన్నారు. అలాగే ఈ ధర్నాకు ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముద్దిరాజు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, బిర్లా ఐలయ్య, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, విహెచ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ హాజరయ్యారు.

# 400 ఎకరాల్లో చెట్ల నరికివేత చేపట్టొద్దు

(మొదటి తరువాయి)

సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్ తరఫున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిఫై చేయలేదన్నారు. ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ- ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు. ఇది కేవలం ఇండస్ట్రీ భూమి మాత్రమేనని.. ఇది ఫారెస్ట్ ఏరియా మాత్రం కానే కాదని ఆయన వివరించారు. ఇక్కడ హెలిప్యాడ్‌లు సైతం నిర్మించారని గుర్తు చేశారు. డిఫెన్స్ మినిస్టర్ వచ్చినా ఇక్కడే హెలికాప్టర్ ల్యాండ్ అవుతుందని కోర్టుకు ఆయన విన్నవించారు. ఈ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఈ కేసును విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం వరకు ఆ భూమిలో ఎటువంటి చెట్లు నరకవద్దని ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# ఆంధ్రలో తొలి బర్డ్‌ఫ్లూ మరణం

(మొదటి తరువాయి)

చిన్నారిని జాయిన్ చేశారు. చిన్నారి మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. అయితే, చికిత్స అందించే సమయంలో చిన్నారి గొంతు, ముక్కు నుంచి స్వాబ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. నివేదిక అనుమానంగా రావడంతో పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ కు శాంపిల్స్ పంపారు వైద్యులు. అయితే, చిన్నారికి హెచ్5 ఎన్1 వైరస్ గా నిర్ధారణ అయింది. బర్డ్ ఫ్లూ మృతిగా తేలడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ తో మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యుల నుంచి శ్వాబ్ శాంపిల్స్ డాక్టర్లు సేకరించారు. ముందు జాగ్రత్తగా మరిన్ని వైద్య పరీక్షల కోసం శాంపిల్స్ తీసుకున్నారు. శ్వాబ్ శాంపిల్స్ ను ఎయిమ్స్, పూణే వైరాలజీ ల్యాబ్ కు అధికారులు పంపనున్నారు. చుట్టుపక్కల ఎవరూ జ్వరంతో బాధపడడం లేదని గుర్తించారు. చిన్నారి కుటు-ంబం నివాసం ఉండే ఇంటికి కిలోమీటరు దూరంలో మాంసం దుకాణం నిర్వహిస్తున్నట్లు- వైద్యాధికారులు గుర్తించారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మార్చ్ 4న పాపకి జ్వరం రావడంతో నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాం.. పరిస్థితి విషమంగా ఉండటంతో మంగళగిరి ఎయిమ్స్ లో జాయిన్ చేశారు.. 10 రోజుల చికిత్స తర్వాత పాప చనిపోవడం జరిగింది.. వైద్యులకు అనుమానం వచ్చి పూణే ల్యాబ్ కి రక్త నమూనాలు పంపించారు. నిన్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటికి వచ్చి మీ పాప బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయింది అని చిన్నారి పెద్దనాన్న చెప్పారు.

# ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

(మొదటి తరువాయి)



హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## తెలంగాణలో ఎల్ఆర్ఎస్

# గడువు పెంపు

(మొదటి తరువాయి)

అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీ-ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధికారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు- ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రోసీడింగ్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటు-లోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్ఆర్ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటు-వంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్ఆర్ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

# శాంతి చర్చలకు మేము సిద్ధం

(మొదటి తరువాయి)

సిద్ధమని మావోయిస్ట్ కేంద్ర కమిటీ సంచలన ప్రకటన చేసింది. 'ప్రజల కోసం ఎప్పుడైనా శాంతి చర్చలకు సిద్ధం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలి. యాంటీ మావోయిస్టు ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలి. ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణలో జరుపుతున్న హత్యాకాండను ఆపాలి' అని మావోయిస్టు కేంద్ర కమిటీ కేంద్రానికి రాసిన లేఖలో పేర్కొంది. శాంతి చర్చలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల వాతావరణం కల్పించాలి. అప్పుడు మేం వెంటనే కాల్పుల విరమణ పాటిస్తాం" అని మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభరు పేరుతో లేఖ విడుదలైంది. దీనికి కేంద్రం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ఆస్తుల పరిరక్షణకే వక్ఫ్ చట్టం సవరణ

(మొదటి తరువాయి)

కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా

పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి.

# నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

(మొదటి తరువాయి)

ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు- చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన నేతలు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్ గుప్తా, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ కాలంలోనే రేవంత్‌పై వ్యతిరేకత

(మొదటి తరువాయి)

మాట్లాడుతూ హైదరాబాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా 400 ఎకరాల భూమిని కాపాడింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని ఆమె పేర్కొన్నారు. ఆ భూముల పరిరక్షణ కోసం కేసీఆర్ నిర్దేశం మేరకు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదనలు వినిపించారన్నారు. ఇది యూనివర్సిటీ భూమి అని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళవద్దన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసిందని గుర్తుచేశారు. యూనివర్సిటీ నుంచి తీసుకున్న భూమిని యూనివర్సిటీకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. 397 ఎకరాలను ఇతర చోట యూనివర్సిటీకి ఇచ్చామని ప్రభుత్వం వితండవాదం చేస్తుందని మండిపడ్డారు. పరిశ్రమల ఏర్పాటు, భూముల విక్రయం ఆ 397 ఎకరాల్లో చేసుకోవచ్చు కదా..? ప్రభుత్వం పర్యావరణం, ప్రకృతి కోణంలో కూడా ఆలోచించాలి అని కవిత సూచించారు. ఇప్పటికే కాంక్రీట్ జంగిల్ లాగా మారిన గచ్చిబౌలి ప్రాంతంలో ఈ 400 ఎకరాల్లో కూడా పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటు అయితే వాతావరణంపై ఎంత ఒత్తిడి పెరుగుతుందో ఆలోచించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో మై హోమ్ విహంగ నిర్మాణానికి భూములు కేటాయించామనడంలో వాస్తవం లేదన్నారు. మై హోమ్ విహంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించినట్లయితే సీఎం రేవంత్ రెడ్డి బుల్డోజర్లను పంపించాలని అన్నారు.

## తెలుగు పంచాంగం 3/4/2025,గురువారం



సూర్యోదయం & సూర్యాస్తమయం:
సూర్యోదయం: ఉదయం 6:12
సూర్యాస్తమయం: సాయంత్రం 6:26
తిథి:
శుక్ల పక్ష షష్టి: ఏప్రిల్ 2 రాత్రి 11:50 నుండి ఏప్రిల్ 3 రాత్రి 9:41 వరకు
శుక్ల పక్ష సప్తమి: ఏప్రిల్ 3 రాత్రి 9:41 నుండి ఏప్రిల్ 4 సాయంత్రం 8:12 వరకు
నక్షత్రం:
రోహిణి: ఏప్రిల్ 2 ఉదయం 8:49 నుండి ఏప్రిల్ 3 ఉదయం 7:02 వరకు
మృగశిర: ఏప్రిల్ 3 ఉదయం 7:02 నుండి ఏప్రిల్ 4 ఉదయం 5:51 వరకు
అశుభ సమయాలు (దోష కాలాలు):
రాహుకాలం: మధ్యాహ్నం 1:51 నుండి 3:22 వరకు
యమగండం: ఉదయం 6:12 నుండి 7:44 వరకు
దుర్ముహూర్తం: ఉదయం 10:17 నుండి 11:06 వరకు, మధ్యాహ్నం 3:10 నుండి 3:59 వరకు
వర్జ్యం: మధ్యాహ్నం 12:21 నుండి 1:52 వరకు
శుభ సమయాలు (శుభ ముహూర్తాలు):
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:54 నుండి 12:43 వరకు
అమృతకాలం: రాత్రి 9:28 నుండి 10:59 వరకు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:35 నుండి 5:23 వరకు

# అత్యాచార కేసులో నిందితుల రిమాండ్

- జిల్లా ఎస్పీ గైక్వాడ్
-విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడి .
నిందితులపై క్రైమ్ నెం:34/2025 70
(1 గ్యాంగ్ రేప్),351,310 కింద కేసులు నమోదు



**కల్వకుర్తి, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండ పేట లో మార్చి 29 వ తేదీ శనివారం దైవ దర్శనానికి వచ్చిన మహిళ పై సామూహిక అత్యాచారం ఘటనలో ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. బుధవారం రోజు కల్వకుర్తి డిఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ మాట్లాడారు.. ఈ కేసు విషయంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారని,కల్వకుర్తి డివిజన్ పరిధి కి చెందిన పోలీసులు మొత్తం కేసు విచారణ ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ కేసులో బాధితురాలు సోమవారం ఉదయం రోజు ఊర్కొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు..వెంటనే కల్వకుర్తి సీఐ నాగార్జున,ఊర్కొండ ఎస్సై కృష్ణ దేవరాయ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయాల్సిందిగా సీనియర్ అధికారీ కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు కు సూచించారు. కేసు దర్యాప్తు ప్రారంభం కాగానే విచారణ చేపట్టి కేసు కు సంబంధించిన పూర్తి ఆధారాలు సీసీ కెమెరాల పుటేజ్ ద్వారా,ఫోన్ల ద్వారా గ్యాంగ్ రేప్ లో ఉన్న ఏడు మంది నిందితులను గుర్తించి అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు.. ఈ ఘటన గురించి వివరాలు వెల్లడిస్తూ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి శనివారం,మంగళవారం రోజు భజనలతో కూడిన పూజలు జరుగుతాయని,చాలా మంది భక్తులు అక్కడే పడుకుంటారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన బాధితురాలు వాళ్ల బంధువుతో కలిసి శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో దేవాలయానికి వచ్చిందని వెల్లడించారు.. ఎస్పీ మాట్లాడుతూ ఘటన జరిగిన శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆలయ సమీపంలో ఆమె బంధువు ను కట్టేసి మహిళపై ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేసినట్లు పేర్కొన్నారు.అత్యాచారం అనంతరం విషయం బయటికి చెబితే ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని,లేదా చంపేస్తామని బాధితురాలిని బెదిరించారు అని ఎస్పీ తెలిపారు. బాధితురాలు ఆలయ ప్రాంగణంలో రాత్రి 2-3 గంటల సమయం వరకు ఉండి,ఊరికి వెళ్లి పోయిన తర్వాత సోమవారం ఉదయం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు విషయంలో తెలంగాణ ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని అందుకే మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ గారు ఈ కేసు విషయంలో విచారణ జరపాలని సంఘటన స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు గ్యాంగ్ రేప్ కేసులో ఉన్న ఏడుగురు నిందితులు 20 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల వయసు వరకు ఉన్నారు అని,వారిపై క్రైమ్ నెం:34/2025 70
(1 గ్యాంగ్ రేప్),351,310 కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన వారిలో 1)మారుపాకుల ఆంజనేయులు(25), 2)సాధిక్ బాబా(28), 3)వాగుల్దాస్ మణికంఠ(21), 4)కార్తీక్(20), 5)మట్ట మహేష్ గౌడ్(28), 6)హరీష్ గౌడ్(23), 7)మట్ట ఆంజనేయులు(24) లు ఉన్నారని చెప్పారు. తెలంగాణ డీజీపీ జితేందర్ గారు ఈ కేసు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కేసు విషయంలో కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు,సీఐ లు నాగార్జున,విష్ణువర్ధన్ రెడ్డి,ఎస్సైలు కృష్ణ దేవరాయ,మాధవ రెడ్డి,కురుమూర్తి సబ్ డివిజన్ పోలీసులు కేసు విచారణ విజయవంతంగా పూర్తి చేసి,ఏడు మంది నిందితులను జైలు పంపే విధంగా పని చేసిన,వారికి జిల్లా పోలీస్ శాఖ తరుపున అభినందనలు తెలిపారు. విలేకరులు ముఖం పై మూత్రం పోశారా అని అడిగిన ప్రశ్నలకు .ఎస్పీ సమాధానం ఇస్తూ నిందితులు,బాధితురాలికి నీళ్లు ఇస్తే కోపం తో పడేయడంతో,కోపంతో ముఖం పై మూత్రం పోసింది నిజమే అని ఎస్పీ స్పష్టం చేశారు. వీరితో పాటు మరి కొన్ని ముఠాలు ఉన్నాయని, వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నామని తెలిపారు.నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది అని ఎస్పీ తెలిపారు.

## పోరాట యోధుడు సర్వాయి పాపన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..



**షాద్ నగర్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని ఈ రోజు ఢిల్లీ లోని తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...17వ శతాబ్దంలో జన్మించిన సర్వాయి పాపన్నగౌడ్ కులవృత్తి చేసుకుంటూ జీవించేవాడని చెప్పారు. తురుష్క, మొగలుల పాలనలో సైనికుల ఆగడాలను ఎదిరించి గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్,కొండ సురేఖ, సహచర ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,శ్రీహరి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి



**ఆమనగల్లు, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మండల కేంద్రంలో బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో గౌడ సంఘానికి చెందిన ప్రముఖులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు గౌరవం తెలియజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజిగౌడ్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, “400 సంవత్సరాలు గడచినా సర్వాయి పాపన్న గౌడ్ పేరు తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. బహుజన ప్రజానీకానికి ఆయన ధైర్యం, ధీరత్వానికి ప్రతీక.” అని ప్రశంసించారు. ఆ తత్వాలను కొనసాగిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. విధివిధాలుగా వేడుకలను నిర్వహించిన గౌడ సంఘం, అతని ఆశయాలను చాటిస్తూ పాపన్న గౌడ్ ప్రభావాన్ని మరింత వెలుగులోకి తెచ్చింది. ఈ కార్యక్రమంలో తాలూక ఉపాధ్యక్షుడు గంగా రవి, టౌన్ ప్రెసిడెంట్ గజ్జ వెంకటయ్య గౌడ్, యువజన అధ్యక్షుడు గుండ్రాతి నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గజ్జ రాఘవేందర్ గౌడ్ వంటి నేతలు పాల్గొన్నారు. అలాగే అల్లాజీ, నరసింహ, శివ, వెంకటేష్, అంజి, సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


## లైసెన్స్‌డ్ తుపాకులు అప్పగించాలి..!!



**హైదరాబాద్,ఏప్రిల్ 02( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నవారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో వాటిని అప్పగించాలని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల23న ఎన్నికలు జరిగి 25న ఫలితాలు వెలుడవతాయని తెలిపారు. 29వ తేదీ తర్వాత ఎవరి తుపాకులు వారికి అందజేస్తారని సీపీ వెల్లడించారు. తుపాకులు డిపాజిట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు..!!

## నేడు కడ్తాలలో మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన

-అధిక సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలి
-డిసిసిబి డైరెక్టర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంప వెంకటేష్ గుప్తా



**కడ్తాల్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కడ్తాల మండల కేంద్రంలో ఈనెల 3 గురువారం ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పర్యటించడం జరుగుతుందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. చరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన గుట్ట తండాలో జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ లు రానున్నట్లు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి నియోజకవర్గం లోని ఏడు మండలాల నుంచి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ లాల్కోట భరతమ్మ నరసింహ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ శివ తదితరులు ఉన్నారు.

## సన్న బియ్యం పంపిణీ తెల్ల రేషన్ కార్డుదారులకు వరం

-పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం
-వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట,02ఏప్రిల్(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం తెల్ల రేషన్ కార్డుదారులకు ఒక వరమని వర్ధన్నపేట మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం అన్నారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు బుధవారం ల్యాబర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు.దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.సన్న బియ్యం పంపిణీ పేదలకు వరం అని మహిళలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ల్యాబర్తి గ్రామపంచాయతీలోని రేషన్ షాప్ లో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**వనపర్తి,ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటను జయించిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని వనపర్తి ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి అన్నారు. బుధవారం సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్దార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మెగా రెడ్డి. సందర్భంగా మాట్లాడుత బహుజన రాజ్యాధికారం కోసం పాపన్న గౌడ్ ఉద్యమించిన తీరు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ,సోషల్ మీడియా, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి







**-ప్రవీణ్ పగడాల హత్యపై సీబీఐతో విచారణ చేపట్టాలి**

**-పట్నం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ దినాకర్**

**-పట్నంలో క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ప్రవీణ్ పగడాల హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ దినాకర్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో 500 మందితో శాంతి ర్యాలీని నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల నియోజకవర్గ, మండల పాస్టర్లు, సంఘస్తులు నిరసన వ్యక్తం చేస్తూ, తమ సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ దినాకర్, నియోజకవర్గ క్రిస్టియన్ కోఆర్డినేటర్ చెరుకూరి రాజులు మాట్లాడుతూ... ప్రవీణ్ పగడాల మరణం సాధారణమైంధి కాదని, అది ముమ్మాటికీ హత్యేనని అన్నారు. ఆయన మరణించి ఇన్ని రోజులు కావోస్తున్నా ఇంతవరకు పోస్టుమార్టం రిపోర్టు రాలేదన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల రాజమండ్రి ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం యావత్ క్రైస్తవ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. వారి మరణం అనేక అనుమానాలకు తావుతీస్తుందని, సమగ్ర విచారణ జరిపించి నిజాలు క్రైస్తవ లోకానికి వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజాస్వామ్య లౌకిక దేశమని ఇక్కడ ఎవరు ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చు, అలాగే ఎవరి మత బోధనలు వారు చేసుకోవచ్చు, ఎవరినైనా కించపరిచే విధంగా వ్యాఖ్యాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప హత్య చేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మనకు న్యాయస్థానలు ఉన్నాయని, ఈ విధమైన హత్యల చర్యలు మంచివి కావని, ఇలాంటి వాటిని ప్రభుత్వాలు ప్రోత్సహించకూడదని, మతోన్మాదాన్ని అంతం చేయాలని, పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి పట్ల క్రైస్తవ సమాజం దిగ్భ్రాంతికి గురైందని, ప్రభుత్వాలు ఈ మరణంపై సమగ్ర విచారణ చేసి, హత్య లేక ప్రమదామా, నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అతని మృతిపట్ల కర్రలతో కొట్టినట్లు బూటు కాళ్ళతో కొట్టినట్లు గుర్తులు ఉన్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. ఇలాంటి జరగకుండా ఒక వేళ అది హత్య అయితే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవకుమార్, పాస్టర్స్ ప్రకాష్, కరుణాకర్, రవికుమార్, సంజీవ, పి.క్రిస్టఫర్, అజయ్ కుమార్, జైరాజ్, జయకుమార్, సైమన్ పీటర్, వివిధ సంఘాల క్రైస్తవ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

మమ్మల్ని సంప్రదించడానికి:
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

# సన్న బియ్యం పంపిణీ దేశంలోనే చారిత్రాత్మక పథకం

**-శ్రీమంతులు తినే సన్న బియ్యం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి కడుపునిండా సన్నబియ్యంతో తిండి**

**-ఎమ్మెల్యే తూడిమేగా రెడ్డి**



**వనపర్తి,ఏప్రిల్ 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):**
రాష్ట్రంలోని తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి నాణ్యమైన సన్న రకం బియ్యాన్ని ఉచితంగా ఇవ్వడం చారిత్రాత్మకమైనదనీ, ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన ప్రభుత్వంలో నిరుపేదలు సైతం సన్న రకం బియ్యంతో నాణ్యమైన భోజనం చేయాలనేది రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిమతమని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఘనపూర్ మండలంలోని 3వ నెంబర్ చౌక ధర దుకాణంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు తో కలిసి వనపర్తి జిల్లాలో సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పేదలకు మూడు పూటల భోజనం పెట్టాలనే ఉన్నత ఆశయంతో ప్రారంభించిన బియ్యం పంపిణీ కార్యక్రమం కాలక్రమేణ ప్రజలు దొడ్డు రకం బియ్యం తినకుండా అమ్ముకోవడంతో తిరిగి మిల్లులకు చేరి రీసైక్లింగ్ కావడం జరిగిందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో శ్రీమంతులు తినే సన్న రకం బియ్యం ప్రతి పేదవాడు సైతం తినాలి అనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం కింద తెల్ల రేషన్ కార్డుల వారికి ఉచితంగా సన్న రకం బియ్యం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దీని కొరకు కేంద్ర ప్రభుత్వం పై రూ . 5481 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం పై రూ. 5173 కోట్ల భారం పడుతుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 1,59,353 తెల్ల రేషన్ కార్డులు ఉండగా 5,22,367 మంది కుటుంబ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. రేషన్ కార్డులోని ఒక్కో కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున సన్న రకం నాణ్యమైన బియ్యం ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని మొత్తం 324 చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందుకు 3309 మెట్రిక్ టన్నుల సన్న రకం బియ్యం అవసరం ఉంటుందనీ తెలియజేశారు. రాష్ట్రంలో ఆర్థిక స్థితిగతులు అంతగా బాగ లేకపోయినప్పటికీనీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ వస్తున్నామని తెలియజేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పెద్దమందడి మండలంలోని ఒకటవ నెంబర్ రేషన్ షాపు, వనపర్తి మున్సిపాలిటీలోని 1,9,20వ నెంబర్ జాతీయ ఉత్పత్తి పంపిణీ కేంద్రాల్లో , గోపాల్ పేట, పెబ్బేరు మండలాల్లో సైతం సన్న రకం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహాశీల్దార్లు, రెవెన్యూ గిర్ధవర్ మధుసూదన్, అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు , మాజీ ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు, తదితరులు శాసన సభ్యుల వెంట కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మల్ రెడ్డి రంగారెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలి నిరాహార దీక్ష



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, శేరిగూడలో గాంధీ విగ్రహం వద్ద ఇబ్రహీపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక అధ్యక్షులు ఉక్కుల అశోక్ మాదిగ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా శేరిగూడ గ్రామం మాజీ సర్పంచ్ గుజ్జ నరసింహారెడ్డి,నిరాహార దీక్ష చేపట్టిన ఉక్కుల అశోక్ కు మద్దతు తెలుపుతూ, పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈసంద్భంగా అశోక్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని, రంగారెడ్డి కి కచ్చితంగా మంత్రి వర్గంలో చోటు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ వైద్యుల ఐక్యవేదిక వైద్యుల ,అధ్యక్షులు ఉక్కుల అశోక్ కు మద్ధతు తెలిపారు.

## కిరాణా షాప్ లో అగ్ని ప్రమాదం

**- బాధితున్ని పరామర్శించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు**



**కేశంపేట్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కేశంపేట్ మండల్ కొండారెడ్డి పల్లి గ్రామంలో కో క్కల చంద్రశేఖర్ కు చెందిన కిరాణా షాప్ నందు అగ్రి ప్రమాదంతో కిరాణా షాప్ లో మంటలు చెలరేగాయి దాదాపు ఒక లక్ష రూపాయల పైగా ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలియజేశారు కావున రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఫరూక్నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ కేశంపేట్ మండలాధ్యక్షులు గంప శ్రీనివాస్ కొత్తూరు మండలాధ్యక్షులు ఉప్పల దయానంద్ మరియు మలిపెద్ది శ్రీనివాస్ గంప లక్ష్మయ్య జగన్ కేశంపేట మండల మాజీ అధ్యక్షులు రాములు తదితరులు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు తగిన సహాయం అందజేస్తామని బాధితులకు తెలియజేయడం జరిగింది.

# వెల్దండలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

**వెల్దండ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వెల్దండ మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభించారు. 4 నెంబర్ రేషన్ షాప్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్వో కార్తీక్ కుమార్, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజీవ్ కుమార్ యాదవ్, పర్వత్ రెడ్డి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మట్ట భరత్ పాల్గొన్నారు. సంభాషణ సందర్భంగా మట్ట వెంకటయ్య మాట్లాడుతూ, "పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రానికి గర్వించదగిన విషయాలు. ఆహార



భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రజల కోసం సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తోంది," అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, ఏం డి హమీద్, ఎం డి రషీద్, బాణావత్ శంకర్ నాయక్, ఎర్ర శీను, వెల్దండ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముదిగొండ రమేష్, మారేపల్లి శీను, ఆనంద్, రేవెల్లి రాజు, నారాయణ, భరత్, డేవిడ్, జంగిలి బాబు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిని పరామర్శించిన నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్



**అనుముల, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ప్రెస్)**
అనుముల మండలం, కొట్టాల గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుండిగల చిన్న నర్సింహా మాతృమూర్తి దుండిగల సాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో, కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ వారి నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించిన నోముల భగత్ కుమార్, వారి బాధను పంచుకున్నారు. ఆయన చూపిన మానవత్వం స్థానికంగా ప్రశంసలపాలైంది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరకుల వెంకటేశ్వర్లు, చేగొండి కృష్ణ యాదవ్, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, రాయణబోయినా రామలింగయ్య, నాయుడు పాలెం గ్రామ శాఖ అధ్యక్షుడు వీర్రాజు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు దుండిగల వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు దుండిగల శ్రీను, పాతన బోయినా దశరథ తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.
**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# శ్రావణ్ అగ్రికల్చర్ ల్యాండ్స్ కార్యాలయం ప్రారంభోత్సవం

-కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి
-యాజమాన్యానికి ప్రత్యేక శుభాభినందనలు తెలియజేసిన ఎమ్మెల్సీ




షాద్ నగర్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)
షాద్ నగర్ పట్టణంలోని పరిగి రోడ్ లోగల శ్రావణ్ అగ్రికల్చర్ ల్యాండ్స్ రియల్ ఎస్టేట్ కార్యాలయ ప్రారంభోత్సవం జరిగింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని యాజమాన్యం సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రవణ్ అగ్రికల్చరల్ ల్యాండ్స్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నీతి నిజాయితీ నిబద్ధతతో కూడిన వ్యాపారం చేయాలని, వ్యవసాయ ఉపయోగమైన భూములకు సంబంధించి ఎన్నో అవంతరాలు ఉంటాయని,, వాటన్నింటినీ సరిచూసుకొని వినియోగదారులు గాని, ఇటు యాజమాన్యం కానీ నష్టపోకుండా వ్యాపారం చేయాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కొద్దిగా ప్రయాసతో కూడుకున్న పని అని, జాగ్రత్తగా ఆచితూచి అడుగు వేస్తే ఆ వ్యాపారంలో కూడా మంచి లాభాలు గడించవచ్చని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి రియల్ ఎస్టేట్ యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో యజమాని శ్రవణ్, రాజశేఖర్ రెడ్డి, దినేష్ సాగర్, శివా చారి తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ నియామకాల అంశంపై ప్రభుత్వ తీరుపై నిరసన

వెల్దండ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు తమ ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్న అనిశ్చితి పరిస్థితి కొనసాగుతూనే ఉంది. 2023 జూలైలో విడుదలైన జీవో నంబర్ 81 మరియు 85 ప్రకారం, 61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, కొన్ని చట్టపరమైన సమస్యల కారణంగా ఈ జీవోలు హైకోర్టు ద్వారా సస్పెండ్ చేయబడ్డాయి. ఈ కారణంగా దాదాపు 3,797 మంది వీఆర్ఏ వారసులు తమ ఉద్యోగ నియామక ఉత్తర్వుల కోసం గత 20 నెలలుగా ఎదురు చూస్తున్నారు. వీరిలో చాలా మంది 10-12 ఏళ్లుగా అనధికారికంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. జీవో ప్రకారం, వారి నియామకాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని వీఆర్ఏ జేఏసీ రాష్ట్ర నాయకులు సుల్తాన్ గౌడ్, గువ్వ మధు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ నియామకాల విషయంలో సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే అనేక కుటుంబాలు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నాయని వారు తెలిపారు. కుటుంబ సభ్యుల నుంచి నో-అబ్జెక్షన్ తీసుకొచ్చేందుకు కొందరు వారి ఆస్తులను వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొందరు





అప్పులు చేసి పత్రాలు సమర్పించారు. అయితే, ఇప్పటికీ నియామక ప్రక్రియలో స్పష్టత లేకపోవడంతో వీరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. గత కొంత కాలంలో 70 మంది వీఆర్ఏ వారసులు ఒత్తిడితో మరణించారని, అలాగే వయోభారంతో 400 మంది 61ం వీఆర్ఏలు చనిపోయారని జేఏసీ నేతలు గుర్తుచేశారు. ఇప్పటికే ఫిబ్రవరిలో ఈ నియామక అంశంపై భారీ స్థాయిలో నిరసనలు జరిగాయి. మార్చిలో సీపీఐ(ఎం) పార్టీ కూడా వీరి కోసం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. గ్రామ పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండేలా నిర్ణయం తీసుకుంది. అయితే, ఇంకా వీఆర్ఏ వారసుల నియామకాలపై స్పష్టత ఇవ్వకపోవడం నిరాశకు గురిచేస్తోంది. ప్రస్తుతం హైకోర్టు స్టే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని వీఆర్ఏ జేఏసీ నాయకులు సుల్తాన్ గౌడ్, గువ్వ మధు కోరుతున్నారు. వీరికి నియామక ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా అనేక కుటుంబాల ఆకాంక్షలు నెరవేరనున్నాయని, గ్రామ పరిపాలన వ్యవస్థ కూడా మరింత సమర్థంగా పని చేసే అవకాశముందని వారు అభిప్రాయపడ్డారు.

# రాంనగర్ రామాలయంలో సీతారాముల కళ్యాణం..

-విజయవంతం చేయండి..
-బిజెపి మహిళా మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా..



వనపర్తి,ఏప్రిల్ 2 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):
వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో ప్రసిద్ధిగాంచిన సీతారాముల ఆలయంలో ఏప్రిల్ 6న సీతారాముల కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి మహిళా మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా భగవంతు తెలిపారు.బుధవారం ఆలయానికి అశ్విని రాధా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రూ.20 వేల విలువచేసే సౌండ్ బాక్స్, ఆమ్లిఫైర్, ఇతర సామాగ్రిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు సదుర్ల రమేష్, చింతకుంట ఆంజనేయులు, పూడూరు మోహన్,చింతకుంట సంపత్,రఘు కురుమూర్తి,సదుర్ల నాగరాజ్,చిన్న గుంటపల్లి నాగరాజు,సదుర్ల మహేందర్ అశ్విని రాజు,అశ్విని మహేష్,నాగవరం చక్రపాణి,అశ్విని పవన్,పూడూరు విజయ్ అశ్విని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో కొట్ర గ్రామాన్ని రాష్ట్రస్థాయికి తీసుకెళ్లాలి

– రవీందర్రావు



వెల్దండ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)
వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామంలో ప్రీమియం లింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. టోర్నమెంట్‌లో లెవెల్ బుల్లెట్ టీం పదివేల రూపాయల నగదు బహుమతితో ప్రధాన బహుమతి అందుకోగా, వీక్ ఇన్ టీం ఐదు వేల రూపాయల నగదు మరియు కప్పుతో రెండో బహుమతిని సొంతం చేసుకుంది. ఈ బహుమతులను గ్రామ సేవా సమితి అధ్యక్షుడు పోలుగోటి రవీందర్ రావు తన వ్యక్తిగత నిధులతో అందజేశారు. ఆయన మాట్లాడుతూ, "గ్రామ యువత క్రీడల్లో రాణించేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తాను. వారు క్రీడల్లో రాష్ట్రస్థాయికి, దేశ స్థాయికి ఎదిగి మా గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలి," అని ఆకాంక్షించారు. క్రీడలు గెలుపు-ఓటములతో సహజమని, స్నేహపూర్వక భావంతో, సమగ్ర సమన్వయంతో క్రీడలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, గ్రామస్థులు మల్లేష్, పర్వతాలు, అల్లాజీతో పాటు క్రీడాకారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# వీ వైశ్య కౌండిన్య హౌస్ 2025-26 నూతన కార్యవర్గం ఎన్నిక

– అధ్యకునిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. కండె నిషాంక్








హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ప్రముఖ వ్యాపార నెట్‌వర్కింగ్ సంస్థ వీ వైశ్య కౌండిన్య హౌస్ 2025–26 సంవత్సరానికి గాను తమ నూతన నాయకత్వాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా హోటల్ మెర్క్యూరీలో నిర్వహించిన వేడుకకు రాష్ట్ర నాయకులు, సంస్థ ముఖ్య సభ్యులు, హౌస్ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ నూతన బాధ్యతలను డా. నిషాంక్ కండె అధ్యక్షుడిగా, చారగండ్ల శ్రీకాంత్ కార్యదర్శిగా, రాజేష్ కల్వాలా కోశాధికారిగా స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన ఈ నాయకులు తమ పాలనాకాలానికి సంబంధించిన దిశానిర్దేశాన్ని ప్రవేశపెట్టారు. వ్యాపార వృద్ధి, పరస్పర సహకారం, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు వీరి ప్రాధాన్య అంశాలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా డా. నిషాంక్ కండె మాట్లాడుతూ, "మా లక్ష్యం 'వీ వైశ్య కౌండిన్య హౌస్' నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం, వ్యాపార సంబంధాలను అర్థవంతంగా అభివృద్ధి చేయడం మరియు సభ్యులకు మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, రాష్ట్ర నాయకులు, వ్యాపార ప్రముఖులు ఈ వేడుకను మరింత వైభవంగా మార్చారు. వీ వైశ్య కౌండిన్య హౌస్ నూతన నాయకత్వం ద్వారా మరిన్ని వ్యాపార అవకాశాలు, సమగ్ర అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు ఊపందుకోవనున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

## ముగిసిన పదో తరగతి పరీక్షలు



**హైదరాబాద్ ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరివారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి. వాటికి కొద్ది మంది మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.

## ఇంటర్ కాలేజీలకు జూన్ 1 వరకు సెలవులు

**సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు: బోర్డు**



**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంటర్మీడియట్ కళాశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. ఈ సెలవులు మార్చి 30 నుంచి ప్రారంభమై జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలలు ఈ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు వేసవి సెలవులను స్వీయ అధ్యయనం, నైపుణ్యాల అభివృద్ధి, ఇతర ప్రయోజనకరమైన కార్యకలాపాలకు వినియోగించుకోవాలని సూచించింది. జూన్ 2నుంచి తరగతులు మళ్లీ ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు వెల్లడించింది. అలాగే, సెలవుల సమయంలో అనధికారికంగా తరగతులను నిర్వహించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## ముస్లింల సంక్షేమానికి వక్ఫ్ ఆస్తులు

**-వక్ఫ్ సవరణకు మద్దతు ఇచ్చిన టిడిపి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం కాకుండా ముస్లింల సంక్షేమానికి వినియోగించాలన్నదే తమ డిమాండ్ అని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో టీడీపీ ఎంపీ కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. వక్ఫ్ కు రూ.1.2 లక్షల కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయని అన్నారు. ఈ ఆస్తులు దుర్వినియోగానికి గురయ్యాయని తెలిపారు. ఈ ఆస్తిని ముస్లింల సంక్షేమం కోసం, మహిళల సంక్షేమం కోసం ఉపయోగించాలని తమ పార్టీ కోరుతోందన్నారు. దీనిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. జేపీసీని డిమాండ్ చేసిన మొదటి పార్టీ తమదే అని పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. 97 లక్షలకు పైగా కమ్యూనికేషన్లు జరిగాయని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ బిల్లు 14 సవరణలతో వచ్చిందని.. తమ పార్టీ మూడు సూచనలు ఇచ్చిందన్నారు. ముస్లింల ప్రయోజనాలను కాపాడే మూడు సూచనలను ఆమోదించారన్నారు. తెలుగుదేశం పార్టీ ముస్లింల సంక్షేమం, అభ్యున్నతికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు కూర్పును నిర్ణయించడానికి, నియమాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఇవ్వాలని తాము కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తాము వక్ఫ్ సవరణ బిల్లును మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు.


## హార్ట్ బ్రేకింగ్.. హెచ్‌సీయూ భూముల

# వివాదంపై అనసూయ కామెంట్



**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హెచ్‌సీయూ విద్యార్థులకు పలువురు రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు సైతం సపోర్ట్ అందిస్తున్నారు. కల్కి డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పందిస్తూ..ఐటీ పార్క్ కోసం 400 ఎకరాల చెట్లని ధ్వంసం చేయడం ఎందుకు .. డెవలప్ చేయాలి అంటే చెట్లు లేని భూములు చాలా ఉన్నాయి కదా అని నాగ్ అశ్విన్ ఇటీవల ప్రశ్నించారు. రేణూ దేశాయ్ కూడా చాలా ఎమోషనల్‌గా దీనిపై స్పందించింది. ఐటీ పార్కులు, ఆకాశాన్ని తాకే భవనాలు అన్నీ అవసరమే. కానీ కుదిరితే ఈ ఒక్క 400 ఎకరాలు వదిలేయండి. తెలంగాణ సిటిజన్ గా నేను వేడుకుంటున్నా. దయచేసి ఏదో విధంగా దీనిని ఆపండి సార్. ఒక తల్లిగా మాత్రమే నేను రిక్వెస్ట్ చేస్తున్నా. ఆ 400 ఎకరాల్లో విధ్వంసం వద్దు అని రేణు దేశాయ్ వేడుకున్నారు. రష్మీ, ప్రకాశ్ రాజ్ ఇలా పలువురు తమ వాదనలు వినిపిస్తున్నారు. ఇప్పుడు ఇదే లిస్ట్‌లో అనసూయ కూడా చేరింది. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో షేర్ చేస్తూ.. ఇది నిజంగా హార్ట్ బ్రేకింగ్ అంటూ రాసుకొచ్చింది. పచ్చని అడివి పూడ్చివేసే రోజు వచ్చింది. ఎరుపు రంగులో ఉన్న చెట్లు నేలకూలాయి అంటూ కామెంట్ పెట్టింది. ఇలా అనసూయ కూడా హెచ్‌సీయూ వివాదంపై తన సపోర్ట్ తెలియజేసింది. ఇక రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగుతూనే ఉంది. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టి బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం



**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ(బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా.. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం గరిష్టంగా ఆదిలాబాద్‌లో 41 కనిష్టంగా రామగుండంలో 35.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళవారం తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్, ఖమ్మం, రామగుండం, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదు అయింది.

## కల్వకుర్తి తాలూకా మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణకు ఘన సన్మానం





**కల్వకుర్తి, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కల్వకుర్తి పట్టణంలో కల్వకుర్తి తాలూకా మిల్లర్ల అసోసియేషన్ కొత్త అధ్యక్షుడిగా బాలకృష్ణ ఎన్నిక కావడం, అలాగే కోశాధికారి రవితో పాటు కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ సమావేశ మందిరంలో జరిపారు. సన్మానం కార్యక్రమానికి ప్రాధాన్యత చేకూర్చుతూ, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, నూతన అధ్యక్షుడిని మరియు కార్యవర్గ సభ్యులను సత్కరించారు. ఉప్పల వెంకటేష్, తమ నాయకత్వంలో అసోసియేషన్ మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వాసవి సేవా సమితి సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ ప్రముఖులు, మరియు అనేక నాయకులు పాల్గొని, తమ మద్దతును వ్యక్తం చేశారు. ముఖ్యంగా, కొత్త అధ్యక్షుడు బాలకృష్ణ నాయకత్వంలో అసోసియేషన్ తాలూకా మిల్లర్లకు మరిన్ని సేవలు అందించాలని ఆశించారు.


## ప్రొఫెసర్లపై లాఠీచార్జీ బాధాకరం

**రాష్ట్రంలో ఎమర్జెన్సీని తలపిస్తున్న రేవంత్ పాలన**



**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యావంతులైన ప్రొఫెసర్ల లాఠీచార్జీ చేయడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గత నాలుగు రోజుల నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం ఉదయం శాంతియుతంగా నిరసన చేపట్టిన ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీని రేవంత్ రెడ్డి సోకాల్డ్ ప్రజాపాలన తలపిస్తుందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి మద్దతుగా నిలిచిన ప్రొఫెసర్లపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పచ్చని అడవిని నాశనం చేయొద్దని శాంతియుతంగా నిరసనకు దిగిన విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. రేవంత్ సర్కార్ వల్ల ఏ వర్గం ప్రశాంతంగా లేదని విమర్శించారు. మొన్నటి నుంచి మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చిన రేవంత్.. ఇప్పుడు హెచ్‌సీయూ భూములపై పడ్డాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ భూముల రక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆకాశ్ అంబానీ



**తిరుమలఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ఆకాశ్ అంబానీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆకాశ్ అంబానీ తిరుమలలోని ఎస్వీ గోశాలను సందర్శించారు. అక్కడ గోపూజ చేసి.. గోమాతకు దాణ సమర్పించారు.

## ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల

**మళ్లీ టాప్ ప్లేస్ ఎలాన్ మస్క్‌దే..**
**అదానీ, అంబానీలు ఏ స్థానంలో ఉన్నారంటే..?**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా 2025 విడుదలైంది. ఈ జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో టాప్ ప్లేస్ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు. ఇక ఈ జాబితాలో యూఎస్ టాప్‌లో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా.. భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినతే ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు.